క్లుప్తంగా

12న ముగ్గుల పోటీలు

చినముత్తేవి(మొవ్వ): సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన మొవ్వ మండలం చినముత్తేవి జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 1981-82 విద్యా సంవత్సరం 10వ సంవత్సరం విద్యార్థులలో పోతుల చిట్టిబాబు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, తాటిపర్తి ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. విజేతల్లో ప్రథమ బహుమతిగా ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్, ద్వితీయ బహుమతిగా ప్రెజర్ కుక్కర్, మూడో స్థానంలో నిలిచిన వారికి కూడా ప్రెజర్ కుక్కర్ బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. నిబంధనలు వర్తించే ఈ పోటీలకు పేర్ల నమోదును తమ వద్ద నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను వండి స్వామికి భక్తులు నివేదనలు చేశారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వీవీఎస్ ప్రసాద్, సిబ్బంది శ్రీహరి పాల్గొన్నారు. రాపర్లలోని వీరాంజనేయస్వామి స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పామర్రు: గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం పీఆర్ ఏఈ రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పామర్రు-గుడివాడ రహదారి నుంచి స్థానిక మాంసం మార్కెట్ టర్నింగ్ వరకు సుమారు 140 మీటర్ల వరకు ఐదు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.20 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ముదినేపల్లి రూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని పేరూరులో దాకరం సొసైటీ మాజీ అధ్యక్షుడు, యాదవ సేవా సంఘం మండల అధ్యక్షుడు సోమా సత్యనారాయణ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పుట్టి హరికుమార్ యాదవ్, కేశింశెట్టి అజయకుమార్, బత్తుల ప్రసాద్, అత్తలూరి బాలాజీ పాల్గొన్నారు.

పిచ్చమ్మ తల్లి ఆశ్రమ ఆరాధనోత్సవాలు

కురుమద్దాలి(పామర్రు): మండలంలోని కురుమద్దాలిలో వేంచేసియున్న శ్రీ రామావధూత పిచ్చమ్మ తల్లి ఆశ్రమం ఆరాధన మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు జరిపించారు. చెరుకూరి రామకృష్ణ ప్రసాద్, రమ దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొసరాజు చంద్రభాను పాల్గొన్నారు.

ఆదర్శ దళిత కమిటీ ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళితులు మండల స్థాయి ఆదర్శ దళిత కమిటీ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన సమావేశం ముదినేపల్లిలో మంగళవారం నిర్వహించి కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మగడ్డ భిక్షాలు గౌరవాధ్యక్షుడిగా దాకరపు నాగమల్లేశ్వరరావు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా లేళ్ల ఆంజనేయులు తదితరులు నియమితులయ్యారు. వీరితో పాటు గౌరవ సలహాదారులు, సంయుక్త కార్యదర్శులను ఎన్నుకున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

గుడ్లవల్లేరు: కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ మెండు సాంబశివరావు హెచ్చరించారు. మంగళవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ వి.విజయసారథి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వరిగడ్డి దగ్ధం

కైకలూరు: మండలంలో వింజరంలో వెళుతున్న గడ్డి ట్రాక్టర్‌కు పైభాగంలో విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించి గడ్డి దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ కథనం మేరకు మంటలు వ్యాపించిన వెంటనే డ్రైవర్ తేరుకుని వరి గడ్డితో ఉన్న ట్రక్కును ట్రాక్టరు నుంచి వేరు చేశాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి ట్రక్కుపై వరి గడ్డిని తొలగించారు. ఈ ప్రమాదంలో రూ.20,000 వరి గడ్డి దగ్ధమైందని ఆయన తెలిపారు. ఫైర్ సిబ్బంది బి.శ్రీనివాసరావు, ఆర్.మురళీకృష్ణ, ఎం.రవీంద్రబాబు మంటలను అదుపు చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంటు

కైకలూరు: సంక్రాంతి పండగ సమయంలో యువత జూదాల వైపు ఆకర్షితులు కాకుండా కైకలూరు టౌన్ పోలీసులు ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటు ఉత్సాహభరితంగా కొనసాగుతుంది. మొత్తం 45 జట్లు పోటీ పడుతున్నాయి. రెండో రోజు మంగళవారం కైకలూరు గవర్నమెంటు జూనియర్ కాలేజీ-వింజరం జూనియర్స్ మధ్య పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన జూనియర్ కాలేజీ జట్టు 10 ఓవర్లలో 39 పరుగులు సాధించింది. వింజరం జట్టు కేవలం రెండు ఓవర్ల ఒక బాల్‌లో లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది.

డ్రెయిన్లు ఇలా.. నీరు సాగేది ఎలా?

వేలాది ఎకరాలకు సాగునీరు అందించే డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూడు, కిక్కిసతో మేట వేసుకుపోయాయి. ప్రతి ఏడాదీ గుర్రపుడెక్క నిర్మూలనకు ప్రభుత్వం నిధులు కేటాయించినా కాంట్రాక్టర్లు పనులు సరిగా చేయడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ముడుపుల మత్తులో జోగుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకు డ్రెయిన్లు ఎగతన్ని పంట పొలాలను, గ్రామాలను ముంచేస్తున్నాయి.

- గుర్రపుడెక్కతో మేట వేసిన డ్రెయిన్లు
- ఆందోళనలో రైతన్నలు


పోలుకొండ వద్ద చంద్రయ్య డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో పలు డ్రెయిన్లు గుర్రపుడెక్కతో నిండి సాగునీరు ముందుకు సాగడంతో లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందాన ప్రభుత్వం నిధులు ఇస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థం రైతులకు శాపంలా మారింది. నియోజకవర్గంలో డ్రెయిన్ల అభివృద్ధికి మెయింటెనెన్స్ రూపంలో ప్రతి ఏడాదీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

పనులు చేపట్టిన దాఖలాలు లేవు

ప్రధానంగా బుడమేరు డ్రెయిన్‌కు పుట్టగుంట వంతెన నుంచి ఎల్ఎస్‌పురం వరకు గుర్రపుడెక్క తొలగింపు పనులను గుడివాడకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్ చేజిక్కించుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సగానికి సగం కోత వేస్తూ టెండర్‌ను సైతం దక్కించుకున్నాడు. పనులు చేపట్టడం మాత్రం శూన్యంగానే ఉంది. గత సంవత్సరం జూన్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు పనులు చేయాల్సి ఉన్నా ఇంత వరకు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. గత ఏడాది సెప్టెంబర్‌లో వరదలు వచ్చిన సమయంలో పుట్టగుంట వంతెన వద్ద తూడు తొలగింపు పనులను మాత్రమే ఉన్నతాధికారుల ఒత్తిడితో చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తూడు, డెక్క తొలగించాలని మొత్తుకున్నా సదరు కాంట్రాక్టర్ పత్తా లేడు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పుట్టగుంట వంతెన వద్ద నుంచి ఎల్ఎస్‌పురం వరకు గుర్రపుడెక్క మేట వేసి నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఫలితంగా పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.


ఇలపర్రు రెగ్యులేటర్ వద్ద బుడమేరులో మేట వేసిన గుర్రపుడెక్క

చంద్రయ్య డ్రెయిన్‌దీ ఇదే పరిస్థితి

మరో మేజర్ అయిన చంద్రయ్య డ్రెయిన్‌దీ ఇదే పరిస్థితి. పెదపారుపూడి నుంచి కొల్లేరు వరకు ఎక్కడ చూసినా గుర్రపుడెక్క దర్శనమిస్తోంది. ఈ డ్రెయిన్ ద్వారా గుడివాడరూరల్, నందివాడ, మండవల్లి మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు మురుగు నీరు పోవాల్సి ఉంది. డ్రెయిన్‌లో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతో పంటలకు నీరు సక్రమంగా అందకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రెయిన్‌కు సంబంధించి గుర్రపుడెక్క తొలగింపునకు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు అడ్డగోలుగా టెండర్లను వేసి పనులు చేయకుండానే బిల్లులు చేయించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ గాలికి వదిలేశారు



డ్రెయిన్ల పర్యవేక్షణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై పనుల నిర్వహణను గాలికి వదిలేశారు. డ్రెయిన్లలో ఎక్కడ చూసినా గుర్రపుడెక్క, తూడే కన్పిస్తోంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం శాపంలా మారింది. వర్షాలు వస్తే డ్రెయిన్లు పొంగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి.

– రవి, లింగవరం

పేరుకుపోయిన గుర్రపుడెక్క



బుడమేరు డ్రెయిన్‌లో పుట్టగుంట వద్ద నుంచి గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది. ప్రతి ఏడాదీ కాంట్రాక్టర్లు కాంట్రాక్టు తీసుకోవడమే గానీ పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇటీవల సంభవించిన వరదలకు పంట పొలాలు, గ్రామాలు ముంపునకు గురై తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం.

– ఆంజనేయులు, రైతు, ఒద్దులమెరక

పనులు చేయిస్తున్నాం

డ్రెయిన్లకు సంబంధించి గుర్రపుడెక్క, తూడు పనులు చేయిస్తున్నాం. కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తున్నాం. దిగువ స్థాయి అధికారులు పనులు చేయించాలి. కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు. పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– గణపతి, డ్రెయినేజీ డీఈ, గుడివాడ

నేడు, రేపు ప్రత్యేక మేళా

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు వివిధ రకాల సేవలందించేందుకు మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్స్ ఎంపిక కోసం ఈనెల 8, 9 తేదీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, వాటర్ ప్యూరిఫైయర్, టీవీలు రిపేర్, ఇన్‌స్టాలేషన్ సేవల కోసం వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ తదితర సేవలందించేందుకు నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి సాంకేతికపరమైన శిక్షణ ఇచ్చి వారికి హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా జీవనోపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 79016 10185, 94932 00858లో సంప్రదించాలని తెలిపారు.

చేతి వృత్తిదారులకు వరం పీఎం విశ్వకర్మ యోజన

కైకలూరు: చేతి వృత్తిదారులకు పీఎం విశ్వకర్మ యోజన వరం వంటిదని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పేర్కొన్నారు. కైకలూరు విద్యాంజలి కాలేజీలో పీఎం విశ్వకర్మ యోజన ట్రెనింగ్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. నాయీ బ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రత్నారావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకం ద్వారా శిక్షణ తీసుకున్న చేతి వృత్తిదారులకు అందించే ధ్రువపత్రంతో బ్యాంకులు వృత్తి పనులకు రుణాలను అందిస్తున్నాయని చెప్పారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లివలస అచ్చారావు, కొత్తకోట స్వామి మాటూరి పండు, ప్రభాకర్, రమేష్, ఆదిశేషు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో జరిపారు. కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు వివరించేందుకే ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రంగుల పోటీలో న్యాయనిర్ణేతలుగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి. జ్యోతి, బి.శ్రావణి వ్యవహరించారు. ఈ పోటీల్లో ఓ. నాగశివమణి, ఎం. నిఖితలు మొదటి, జి. వాసంతి, వై. అనూషలు రెండవ, ఎం. మధులత, ఎ. ప్రమీలారాణి తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పెంచిన కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలి

గుడివాడ టౌన్: పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎం చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు ఎక్కడ పెంచామని బదులివ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. కరెంట్ చార్జీలు పెరగడానికి జగన్‌మోహన్‌రెడ్డి కారణమని పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో కరెంట్ చార్జీలు పెంపు పరిశీలించగా ఒక మీటరు బిల్లులో కరెంట్ ఏమీ వాడకపోయినా యూజర్ చార్జీలు, ట్రూఆఫ్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు అంటూ రూ.230 బిల్లు వచ్చిందన్నారు. దారుణంగా చార్జీలు పెరిగాయనడానికి ఇంతకు మించి నిదర్శనం ఏమి కావాలని ప్రశ్నించారు. కరెంట్ చార్జీలు ఇలా పెంచితే సామాన్య, మధ్య తరగతి వారు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. కావున ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఎం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, లంకా సురేంద్ర, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

గుడివాడ టౌన్: పట్టణంలో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణంలో జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల సుధాకర్, వెంపటి సైమన్, కేజే విక్టర్ పాల్, కె బాబూరావు, పి. శేఖర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

గుడివాడ టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు నిర్వహించిన ఈ ఎంపికలో మొత్తం 29 మంది హాజరుకాగా ఐదుగురికి ఉద్యోగాలు లభించగా ఇరువురు షార్ట్‌లిస్ట్‌లో చేర్చబడినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, అధికారులు టీఓ. జయరామ్, ఆనంద్ వేణుగోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు గణితక్లబ్ ప్రారంభం

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్లో బుధవారం గణిత క్లబ్ ప్రారంభిస్తున్నట్లు హెచ్ఎం వై.విజయకుమార్ గణిత ఉపాధ్యాయులు డి.సంధ్య, జి.రమేష్, ఇస్మాయిల్ తెలిపారు. ఈ క్లబ్ వలన విద్యార్థులు గణితంలో మంచి పట్టు సాధించేందుకు, పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. క్లబ్ ద్వారా విద్యార్థులకు గణితంలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత పశువైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో పెంజెండ్రలో వల్లభనేని రామకృష్ణ, బొప్పన శివప్రసాద్ ఆర్థిక సాయంతో పశువులకు మంగళవారం మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు అవసరమైన మందులను ఉచితంగా పాడి రైతులకు పంపిణీ చేశారు. అలాగే వడ్లమన్నాడులో టెన్త్ విద్యార్థులకు సుభాష్ చంద్రబోస్‌చే కెరీర్ గైడ్‌లెన్స్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


దొండపాడులో తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు


కొండిపర్రులో నిర్వహించిన రెవెన్యూ సదస్సు

గుడివాడరూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని దొండపాడు గ్రామంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వో సుబ్బారావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతుల కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని ములకలపల్లి, బొమ్మినంపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు అర్జీలను అందజేశారు.

పామర్రులో..

కొండిపర్రు(పామర్రు): గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నామని పామర్రు డిప్యూటీ తహసీల్దార్ (రీసర్వే) గంగాధర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కొండిపర్రులో మంగళవారం సదస్సు నిర్వహించారు. గ్రామంలో మూడు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీఆర్వో అనిత, గ్రామ సర్వేయర్ రెహానా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తోట్లవల్లూరు: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీ రాజ్, హౌసింగ్, ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్అండ్‌బీ, ఐసీడీఎస్, పశుసంవర్థకం, తదితర శాఖలకు సంబంధించి శాఖల వారీగా పనితీరుపై ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రవికాంత్, తహసీల్దార్ కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

రహదారుల అభివృద్ధికి చర్యలు

గుడివాడరూరల్: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలోని ప్రజావేదికలో పంచాయతీరాజ్ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు ఈ నెలాకరుకల్లా పూర్తి చేయాలన్నారు. దోకిపర్రు-నిడుమోలు రహదారి నిర్మాణం ఆలస్యంపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీరాజ్ డీఈ బి.రవికుమార్, ఏఈలు వల్లభనేని సూరిబాబు, జె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

కోడి పందేలకు దూరంగా ఉండాలి

కైకలూరు: కోడి పందేలు, పేకాటకు దూరంగా ఉండాలని కై కలూరు రూరల్, కలిదిండి ఎస్ఐలు వి.రాంబాబు, వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరు మండలం చటాకాయి, వదర్లపాడు, దొడ్డిపట్ల, కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామాల్లో జూదాలు వద్దని ప్రజలకు అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఎస్ఐలు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర ఆటలు ఆడుకోవాలని సూచించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కలిదిండి మండలం పడమటిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,200 సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

షాపు యజమానిపై కేసు నమోదు

పామర్రు: స్థానిక శివరామ కాంప్లెక్సులో ఓ షాపు యజమానిపై కేసు నమోదు అయిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు శివ రామ కాంప్లెక్సులోని ఓ ఎలక్ట్రానిక్ షాపులో కస్టమర్ నాగేశ్వరరావుకు షాపు యజమాని శ్రీనివాసరావుకు పైపుల కొనుగోలులో వివాదం ఏర్పడింది. దీంతో కస్టమర్ అతడిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసి సంబంధిత షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.


ఆకట్టుకున్న సంక్రాంతి వేషధారణలు


వేంకటేశ్వరస్వామి, గోదాదేవి వేషధారణలో చిన్నారులు

పండుగ కళ

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండుగ కైకలూరు విజ్ఞాన్ స్కూల్లో ముందే వచ్చేసింది. భోగి మంటలు, గొబ్బెమ్మలు, పిల్లలకు భోగి పండ్లు, ముగ్గులు, చెరుకుగడలు, బొమ్మల కొలువులు, హరిదాసులు, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన ఇలా పండుగ కళ ఉట్టి పడేవిధంగా మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రధానంగా వేంకటేశ్వరస్వామి వేషధారణలతో చిన్నారులు ప్రదర్శించిన గోదాదేవీ కల్యాణం అందరినీ ఆకట్టుకుంది. పలు దేవతా వేషధారణలతో విద్యార్థుల ప్రదర్శన అలరించింది. యాజమాన్యం జి.రంగారావు, దుర్గ, నాగలక్ష్మి చిన్నారులను ఆశీర్వదించారు.

– కైకలూరు


భోగి మంటలు